క్లుప్తంగా

ఎంవీఆర్‌లో రేపు మెగా జాబ్‌మేళా

గాజువాక: స్థానిక ఎంవీఆర్ డిగ్రీ కళాశాలలో ఈ నెల 16న మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ ఎ.బాలకృష్ణ తెలిపారు. 22 కంపెనీల్లో వివిధ ఉద్యోగాల భర్తీ కోసం ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ జాబ్‌మేళాను ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ప్రారంభించనున్నట్టు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలను వెంటనే అందజేస్తారన్నారు. 2025 సంవత్సరంలో టెన్త్, ఇంటర్, డిగ్రీ, ఇంజినీరింగ్, పీజీ, ఐటీఐ పాసైన అభ్యర్థులు కూడా జాబ్‌మేళాకు హాజరుకావచ్చన్నారు.

అప్పన్నకు విశేషంగా నిత్యకల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవింద రాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేసి ఉదయం 9.30 గంటల నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

రైల్వేస్టేషన్‌లో 11 కిలోల గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వే స్టేషన్‌లో శనివారం రైల్వే పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో గంజాయి అక్రమ రవాణా చేస్తున్న నిందితులను అదుపులోకి తీసుకుని, 11 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గవర్నమెంట్ రైల్వే పోలీసులు తెలిపిన వివరాలిలా.. జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సిహెచ్.ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఎస్ఐ శాంతారాం, ఆర్పీఎఫ్ సిబ్బందితో కలిసి రైల్వే స్టేషన్‌లోని వివిధ ప్లాట్‌ఫారాల్లో తనిఖీలు చేశారు. తమిళనాడు కన్యాకుమారి జిల్లాకు చెందిన అలమీన్, అజిత్ అయ్యప్పన్‌లు విశాఖ రైల్వేస్టేషన్ మీదుగా తమిళనాడుకు గంజాయిని అక్రమంగా రవాణా చేయడం గుర్తించి వీరిని అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి రూ.55 వేల విలువైన 11 కేజీల గంజాయిని సీజ్ చేశారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరచినట్లు జీఆర్పీ సిబ్బంది తెలిపారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం



సీతారామయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఆంధ్రా బ్యాంక్ రిటైర్డ్ ఉద్యోగులు

సీతంపేట: ఇటీవల జరుగుతున్న సైబర్ నేరాలపై రిటైర్డ్ ఉద్యోగులు అవగాహన పెంపొందించుకోవాలని సభాధ్యక్షుడు డీజీఎస్ జి.వాసుదేవమూర్తి సూచించారు. ఆంధ్రా బ్యాంక్ విశ్రాంత ఉద్యోగుల సమావేశం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ మోసాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఏజీఎస్ టి.కామేశ్వరరావు, ఈసీ మెంబర్ ఎం.సూర్యభాస్కరరావు, కోశాధికారి జి.ముత్యుంజయరావులు మాట్లాడుతూ బ్యాంకు ఉద్యోగుల హెల్త్ ఇన్సూరెన్స్ ప్రీమియం, హౌసింగ్ లోన్ ఇన్సూరెన్స్‌పై అవగాహన కల్పించారు. సభ్యుల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించారు. ముందుగా ఆంధ్రా బ్యాంక్ వ్యవస్థాపకుడు డాక్టర్ భోగరాజు పట్టాభి సీతారామయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎం.సూర్యభాస్కరరావు, ఆర్.వి.రవికుమార్, విశ్రాంత జనరల్ మేనేజర్ టి.వి.ఎస్.చంద్రశేఖర్, బ్యాంక్ విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

గురువుల ఆరాధనోత్సవాలు

సీతంపేట: అక్కయ్యపాలెంలోని శ్రీలలితాపీఠంలో గురువుల ఆరాధనోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. లలితాపీఠం ద్వితీయ పీఠాధిపతి అవ్యక్తానంద మహరాజ్ జయంతి సందర్భంగా మూడు రోజుల పాటు ఈ ఆరాధనోత్సవాలు జరగనున్నాయి. ఈ వేడుకల్లో భాగంగా శనివారం పీఠం ఆవరణలోని అవ్యక్తానంద మహరాజ్ విగ్రహానికి విశేష అభిషేకం, అర్చనలు నిర్వహించారు. పీఠం ఉత్తరాధికారి దత్తేశ్వరానంద భారతీ స్వామి స్వయంగా పూజలు చేసి, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

అంగన్‌వాడీల అవస్థలు!

నియోజకవర్గంలోని అంగన్ వాడీ కేంద్రాలు	60
సొంతభవనాలు ఉన్న కేంద్రాలు	6
అద్దె భవనాల్లో నిర్వహించే కేంద్రాలు	14
రెంట్ ఫ్రీ భవనాల్లో నిర్వహిస్తున్న కేంద్రాలు	40

- రేషన్ కోసం అష్టకష్టాలు
- సకాలంలో అందనివేతనాలు
- 'తల్లికి వందనం'కు నోచుకోని కార్యకర్తలు
- కూటమి ప్రభుత్వ తీరుపై తీవ్ర అసంతృప్తి
- రేపు కలెక్టరేట్ వద్ద ధర్నాకు పిలుపు



రేషన్ కోసం వేచి ఉన్న కార్యకర్త



చిన్నారులకు బోధన చేస్తున్న కార్యకర్త

విశాఖ విద్య: అంగన్‌వాడీ కార్యకర్తలకు ఉద్యోగం కత్తిమీద సాములా మారుతోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా పిల్లలు, గర్భిణులు, తల్లుల ఫొటోలతో కూడిన వివరాలను పోషణ్ ట్రాకర్, బాలసంజీవని అనే రెండు యాప్ లలో ప్రతీ రోజూ అప్‌లోడ్ చేయాలనే ఆదేశాలతో కార్యకర్తలు ఒత్తిడికి గురవుతున్నారు. సెల్‌ఫోన్ సిగ్నల్ సమస్యతో వివరాలు సవ్యంగా నమోదు కాని పరిస్థితుల్లో ఉన్నతాధికారులతో మాటలు పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సేవాభావంతో బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలపై కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలు వారిని ఆలోచనలో పడేస్తున్నాయి. మరో వైపు గతంలో ఎన్నడూ లేని విధంగా అంగన్‌వాడీలకు సంక్షేమ పథకాలు కోత పెడుతోంది కూటమి ప్రభుత్వం.

మొదలైన రేషన్ కష్టాలు

అంగన్‌వాడీలకు సంబంధిన నిత్యావసర సరకులు అన్నీ గతంలో నేరుగా కేంద్రాలకు వచ్చేవి. కానీ, ప్రస్తుతం బియ్యం, కందిపప్పు, పంచదార వంటి సరకులు డీలర్ వద్దకు వెళ్లి తెచ్చుకోవడం వారికి ఇబ్బందిగా మారింది. రేషన్ షాపు నుంచి బియ్యం బస్తాలు ఎలా మోసుకొస్తామని, ఆటోలో తెచ్చుకుందామంటే రవాణా చార్జీలు ఎవరు ఇస్తారని వారు ప్రశ్నిస్తున్నారు.



అంగన్‌వాడీ బియ్యాన్ని డీలర్ నుంచి తీసుకెళ్తున్న సహాయకుడు

భారమవుతున్న కేంద్రాల నిర్వహణ

అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ భారం కార్యకర్తలపైనే పడుతోంది. మే నెల వేతనాలు ఇంకా అందలేదు. ఏప్రిల్, మే నెలకు సంబంధించిన నిర్వహణ నిధులు మంజూరు కావాల్సి ఉంది. నిర్వహణ నిధులు సకాలంలో ఇవ్వకపోవడంతో చేతి డబ్బులతోనే కూరగాయలు, ఇతర సామగ్రి కొనుగోలు చేయాల్సి వస్తోందని కార్యకర్తలు అంటున్నారు. అద్దె భవనాలకు సంబంధించి విద్యుత్ బిల్లుల భారం కూడా అంగన్‌వాడీ కార్యకర్తలపైనే పడుతోంది. కేంద్రాల్లో సౌకర్యాలను మెరుగుపరిచే విషయంలో ఏమాత్రం శ్రద్ధ తీసుకోకపోగా, తనిఖీల పేరుతో కూటమి పార్టీలకు చెందిన చోటా మోటా నాయకులు కేంద్రాలకు వచ్చి హడావుడి చేస్తుండడం అంగన్‌వాడీ కార్యకర్తలకు మరింత ఇబ్బందిగా మారుతోంది.

అంగన్‌వాడీలకు ఏదీ తల్లికి వందనం?

అంగన్‌వాడీ కార్యకర్తల పిల్లలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అమ్మ ఒడి పథకం వర్తించేది. కానీ, కూటమి ప్రభుత్వం మాత్రం వారికి తల్లికి వందనం పథకం మంజూరు చేయలేదు. నెలకు రూ.12 వేలకు పైగా వేతనం పొందే వారికి తల్లికి వందనం ఇవ్వమని కూటమి ప్రభుత్వం నిబంధన పెట్టింది. కానీ, అంగన్‌వాడీ కార్యకర్తలకు నెలకు రూ.11,500 మాత్రమే వేతనం వస్తోంది. అది కూడా ఏ నెల కానెల అందని పరిస్థితులు ఉన్నాయి. అయినా తల్లికి వందనం పథకం లేదని చెబుతుండంపై అంగన్‌వాడీ కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆయాలకు కూడా తల్లికి వందనం మంజూరు కాకపోవడం గమనార్హం. దీంతో వారంతా సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేయడానికి సన్నద్ధమవుతున్నారు.

సంక్షేమ పథకాలు ఇవ్వాలి



తల్లికి వందనం పథకం రాకపోవడంతో మేమంతా ఆశ్చర్యానికి గురవుతున్నాం. జీతం పెంచాలని ప్రభుత్వాన్ని కోరుతున్నా పట్టించుకోవడం లేదు. అలాంటప్పుడు సంక్షేమ పథకాలైనా మాకు ఇవ్వాలి కదా. తల్లికి వందనంతో పాటు ఇతర సంక్షేమ పథకాలు అంగన్‌వాడీ కార్యకర్తలకు వర్తింపజేయాలని కోరుతూ సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తాం.

–యు. వెంకటలక్ష్మి, అంగన్‌వాడీ అసోసియేషన్ జిల్లా నాయకురాలు

సమస్యలు పరిష్కరించాలి



అంగన్‌వాడీ కేంద్రాల్లో సమస్యలను తక్షణమే పరిష్కరించేలా కూటమి ప్రభుత్వం శ్రద్ధ తీసుకోవాలి. కేంద్రాల్లో పనిచేసే కార్యకర్తలకు, ఆయాలకు తల్లికి వందనం మంజూరు చేయాలి. బియ్యం, ఇతర నిత్యావసర సరుకులన్నీ కేంద్రాలకే నేరుగా సరఫరా చేయాలి. అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలకు, ఆయాలకు వేతనాలు పెంచాలి.

–సాయిలత, జిల్లా అధ్యక్షురాలు, వైఎస్సార్‌సీపీ అంగన్‌వాడీల విభాగం

17న మోదకొండమ్మ పండగ



మోద కొండమ్మ అమ్మవారు

గోపాలపట్నం: గోపాలపట్నం పరిసర ప్రాంతాల కొంగు బంగారంగా వెలుగొందుతున్న మోద కొండమ్మ అమ్మవారి పండగ ఈ నెల 17న నిర్వహించడానికి విస్తృతంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఇందిరానగర్‌లో ఆలయ పరిసర ప్రాంతాలను ముస్తాబు చేశారు. విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆదివారం ఉదయం 9 గంటలకు పుట్ట బంగారం తీసే కార్యక్రమం ఉంటుందని ఆలయ కమిటీ తెలిపింది. సాయంత్రం 6 నుంచి అమ్మవారి ఘటాల ఊరేగింపు జరుగుతుందని తెలిపారు. 16న తొలేళ్ల పండగ పురస్కరించుకుని సాయంత్రం అమ్మవారి సారె ఊరేగింపు చేపడతామని పేర్కొన్నారు. 17న మంగళవారం ప్రధాన పండగ జరుగుతుందని తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు రానున్న నేపథ్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

వైభవంగా నవదుర్గ అమ్మవారి పూజలు



పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే నాగిరెడ్డి

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు పిలకవానిపాలెం కొండపై వెలసిన నవదుర్గా అమ్మవారి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ 5వ వార్షికోత్సవం సందర్భంగా ఆలయ ధర్మకర్త గిన్ని శివరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన పూజల్లో గాజువాక మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి పాల్గొన్నారు. అమ్మవారికి పసుపు,కుంకుమలతో పూజలు చేశారు. ఉదయం గ్రామ తిరువీధుల్లో అమ్మవారి ఘటాలను ఊరేగించారు.అనంతరం ప్రత్యేక కుంకుమార్చన చేపట్టారు. సాయంత్రం కలశజ్యోతి పూజ చేశారు. మందిరం వద్ద మహిళలచే కోలాటం ,సేవ గరిడి వంటి సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

డాక్‌యార్డ్ మార్గంలో చుక్కలు



గూడ్స్ రైలు నిలవడంతో ఏర్పడిన ట్రాఫిక్ సమస్య



డాక్‌యార్డ్ నుంచి గోడౌన్స్ వరకు నిలిచిన ట్రాఫిక్

మల్కాపురం: సేవా మార్గం మధ్యలో రైల్వే ట్రాక్‌పై గూడ్స్ రైలు నిలవడంతో తీవ్ర ట్రాఫిక్ సమస్య నెలకుంది. సుమారు 30 నిమిషాల పాటు వాహనదారులు అవస్థలు పడ్డారు.డాక్‌యార్డ్ నుంచి వీడీఆర్ గొడౌన్స్‌కు వెళ్లే మార్గం మధ్య రైల్వే ట్రాక్ ఉంది. అయితే శనివారం ఉదయం 10 గంటల సమయంలో ఓ గూడ్స్‌రైలు ట్రాక్‌పై నిలిచింది. దీంతో డాక్‌యార్డ్ నుంచి వీడీఆర్ గోడౌన్స్ మీదుగా మారుతీ సర్కిల్ వైపు వెళ్లే వారు.. అలాగే మారుతీ సర్కిల్ నుంచి సింధియా, డాక్‌యార్డ్ వైపు వచ్చే పలు వాహనాలు మధ్యలో నిలిచిపోయాయి. దీంతో వాహనదారులు,విద్యార్థులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ఆ సమయంలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో ఒక వైపు ఎండ ,మరో వైపు నిలిచి వాహనాల ద్వారా వచ్చే పొగ పీల్చుకోలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

త్వరలో వాట్సాప్ గవర్నెన్స్ సేవలు

మహారాణిపేట: ఆన్‌లైన్ సేవలను అభివృద్ధి చేశామని, త్వరలో వాట్సాప్ గవర్నెన్స్‌ను ప్రారంభించి వైద్యులు తమ సర్టిఫికెట్లను అప్‌లోడ్ చేయడమే కాకుండా, ఫీజు కూడా చెల్లించే విధంగా చర్యలు తీసుకుంటామని ఆంధ్రప్రదేశ్ వైద్య మండలి చైర్మన్ డాక్టర్ దగ్గుమాటి శ్రీహరిరావు అన్నారు. శనివారం ఆంధ్ర వైద్య కళాశాలలో ఆంధ్రప్రదేశ్ వైద్య మండలి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో రెన్యువల్, రీ–రిజిస్ట్రేషన్, ఎన్‌వోసీ, గుడ్ స్టాండింగ్ సేవలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలి సభ్యులు, రిజిస్ట్రార్ సిబ్బంది సహకారంతో రెండవ జిల్లా కేంద్ర కార్యక్రమాన్ని ఇక్కడ రెండు రోజుల పాటు నిర్వహిస్తున్నామని తెలిపారు. గతంలో రెన్యువల్ సమయం పూర్తయిన తర్వాత మాత్రమే రిజిస్ట్రేషన్ చేసేవారని, దేశంలో మొట్టమొదటి సారిగా అన్ని జిల్లా కేంద్రాల్లో వైద్య మండలి ఆధ్వర్యంలో ఈ నెల 7వ తేదీన విజయనగరం జిల్లా కేంద్రంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ఈ రోజు విశాఖలో రెండవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు. అంతే కాకుండా ఒకసారి మాత్రమే వైద్య మండలికి వచ్చి వారి వేలిముద్ర, సంతకం, ఐరిస్‌లను కంప్యూటర్‌లో నిక్షిప్తం చేస్తామని, జీవితంలో మళ్లీ వైద్య మండలికి రావాల్సిన అవసరం ఉండదని, ఆ తర్వాత వారు ఆన్‌లైన్ ద్వారా రెన్యువల్ చేసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య మండలి సభ్యులు డాక్టర్ కేశవరావుబాబు, ఆంధ్ర వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యాదేవి, కేజీహెచ్ సీఎస్ఆర్ఎంవో డాక్టర్ యు. శ్రీహరి, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు డాక్టర్ జె.సి. నాయుడు, అసోసియేషన్ నాయకులు డాక్టర్ పి.జె. శ్రీనివాస్, డాక్టర్ బాబూరావు, 600 మంది వైద్యులు పాల్గొన్నారు.



డాక్టర్ శ్రీహరిరావును సన్మానిస్తున్న ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నాయకులు

ఇదేం విడ్డూరం?

- ప్రభుత్వ భవనంలో పార్టీ కార్యాలయం ఏర్పాటా!
- మండిపడుతున్న ప్రజలు



నందమూరినగర్‌లో కమ్యూనిటీ హాలుకు అలంకరించిన తోరణాలు, ప్రాంగణంలో పార్టీ జెండా

గోపాలపట్నం: ప్రభుత్వ భవనాలు పార్టీ కార్యాలయాలుగా మారుతున్నాయి. పార్టీ జెండాలతో నింపేస్తూ కార్యకలాపాలు వాటిల్లోనే నిర్వహిస్తున్నారు. జీవీఎంసీ 92వ వార్డు నందమూరినగర్‌లో కమ్యూనిటీ హాలునే టీడీపీ నాయకులు పార్టీ కార్యాలయంగా మార్చేశారు. ఇటీవల పార్టీ కార్యక్రమాలు చేసిన టీడీపీ నాయకులు కమ్యూనిటీ హాలు వద్ద పార్టీ జెండా ఎగుర వేశారు. అంతే కాకుండా పార్టీ జెండాల తోరణాలను కమ్యూనిటీ హాలుకు అలంకరించారు. ప్రభుత్వ భవనాలపై పార్టీ జెండాలు, తోరణలాలు కట్టకూడదన్న నిబంధన ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. కనీసం సచివాలయ కార్యదర్శులు కూడా వీటిని పట్టిచుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. వీటిని వెంటనే తొలగించాలని కోరుతున్నారు.

సిరులతల్లికి తులసిపూజ



దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో శనివారం తులసిపూజ నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో, అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ప్రతి శనివారం నిర్వహించే తులసి పూజలో పాల్గొన దలిచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ ఈవో కె. శోభారాణి తెలిపారు. ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఈవో కె. శోభారాణి, ఏఈవో తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తస్మాత్ జాగ్రత్త!



ఫోకస్

జీవీఎంసీ 92వ వార్డు శ్రీరామ్‌నగర్‌లో సీఎంఆర్ వెనుక రోడ్డులో మ్యాన్‌హోల్‌పై పలక ఊడిపోయింది. అయినా అధికారులు పట్టించుకోలేదు. రోడ్డు మధ్యలో గుంతను గుర్తించలేక ప్రమాదాలు సంభవించే పరిస్థితి ఏర్పడింది. దీంతో తస్మాత్ జాగ్రత్త చూసి వెళ్లండి అంటూ అప్రమత్తం చేసేవిధంగా సంచి ఏర్పాటు చేశారు. మ్యాన్‌హోల్ మూత లేక పోవడంతో స్థానికులు కర్ర ఏర్పాటు చేసి గన్ని బ్యాగ్ పెట్టారు. ఇది వాహన చోదకులు, పాదచారులను నిత్యం అప్రమత్తం చేస్తోంది. అధికారులు సకాలంలో స్పందించక పోవడంతో దీన్ని ఈ విధంగా ఏర్పాటు చేశామని స్థానికులు చెబుతున్నారు. - గోపాలపట్నం

విమాన ప్రమాద మృతులకు నివాళి



మృతులకు నివాళులర్పిస్తున్న నానాజీ తదితరులు

మల్కాపురం: అహ్మదాబాద్‌లో ఎయిర్ ఇండియా విమానం ప్రమాద ఘటనలో మృతి చెందిన వారికి సామాజికసేవా కార్యకర్త పెద్దిరెడ్ల నానాజీ శనివారం నివాళులర్పించారు. 58వ వార్డు శ్రీహరిపురం వద్ద శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విమానం ప్రమాద ఘటనలో మన దేశీయులతో పాటు విదేశీయులు,చిన్నారులు ఉండడంచాలా బాధాకరం అన్నారు. ఇలాంటి ఘటన దేశంలో ఎప్పుడు చోటు చేసుకోలేదని వివరించారు. కేంద్ర ప్రభుత్వం దీనిపై స్పందించి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. మృతుల కుటుంబాలకు అవసరమైన సాయం కేంద్రం అందించాలన్నారు.

ఒకరి రక్తదానం.. మరొకరికి ప్రాణదానం



విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న క్యాడెట్లు

దాబాగార్డెన్స్: ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ క్యాడెట్లు, విద్యార్థులు, సిబ్బంది రక్తదానం ప్రాముఖ్యత, ప్రజల్లో అవగాహన పెంపొందించడం లక్ష్యంగా ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. మంజుల మాట్లాడుతూ రక్తదానం ఇంకొకరి ప్రాణాన్ని కాపాడగలదని, ఆరోగ్యవంతమైన యువత రక్తదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కళాశాల ఫిజికల్ డైరెక్టర్ ఆర్. కిరణ్మయి, ఎన్‌సీసీ ఆఫీసర్ డాక్టర్ కె.గీతాంజలి, జేకేసీ మెంటార్ రాజు, కాంటిజెంట్ లీడర్ ఎన్. దీపిక, ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు.

రక్తదాతలు ప్రాణదాతలు..

జైభీమ్ సంస్థ ఆధ్వర్యంలో కేజీహెచ్ ఓపీ గేటుకు ఎదురుగా మైక్రో ల్యాబ్స్‌లో లయన్స్ బ్లడ్ బ్యాంక్ సహకారంతో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. వన్ టౌన్ సీఐ జీడీ బాబు రక్తదానం చేశారు. కార్యక్రమంలో న్యూరో సైకియాట్రిస్ట్ డాక్టర్ రమేష్‌బాబు, జైభీమ్ సంస్థ కన్వీనర్ కోన ప్రకాష్, గ్రామీణ వైద్యుల సంఘం అధ్యక్షుడు జంగం జోషి పాల్గొన్నారు.

పరిశ్రమల్లో భద్రతను ఉపేక్షిస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న పొల్యూషన్ కంట్రోల్ బోర్డు చైర్మన్ కృష్ణయ్య

పరవాడ: ఫార్మాసిటీ పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలను నిర్లక్ష్యం చేస్తే సహించబోమని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు చైర్మన్ కృష్ణయ్య పరిశ్రమల యాజమాన్యాలను హెచ్చరించారు. గొర్లివానిపాలెం లారల్ రీజినల్ కార్యాలయంలో పరిశ్రమ యాజమాన్యాలతో శనివారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన ప్రసంగించారు. కార్మికుల భద్రత కోసం అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్మికుల భద్రతకు అవసరమైన సామగ్రిని వారికి సమకూర్చడానికి యాజమాన్యాలు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రమాదాల నివారణకు పరిశ్రమల్లో పటిష్టమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని సూచించారు. క్రమం తప్పకుండా పరిశ్రమల్లో ఆడిట్లు, మాక్ డ్రిల్ నిర్వహించాలని తెలిపారు. భద్రత ప్రోటోకాల్‌పై కార్మికులకు శిక్షణ కల్పించాలన్నారు. పరిశ్రమల ప్రాంగణాల్లో ఉద్యోగులు, కార్మికులు రక్షణ పరికరాలు విధిగా ధరించాలన్నారు. ప్రమాదకర కార్యకలాపాలను అర్హత కలిగిన సాంకేతిక సిబ్బంది పర్యవేక్షించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పరిశ్రమలో భద్రతా చర్యలను పర్యవేక్షించేందుకు ప్రత్యేకంగా విజిలెన్స్ విభాగాన్ని ఏర్పాటు చేయాలని తెలిపారు. జేఎన్‌పీసీ మేనేజ్‌మెంట్ కార్మికుల భద్రత కోసం నిర్వహిస్తున్న కార్యక్రమాలను మేనేజ్‌మెంట్ ప్రతినిధి జె.సుబ్బారావు వివరించారు. ఈ సమావేశంలో అనకాపల్లి జిల్లా అగ్నిమాపక శాఖ, బ్రాయిలర్, జిల్లా పరిశ్రమల శాఖలు, జేఎన్‌పీసీ పరిశ్రమల యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు.